క్లుప్తంగా

పిల్లలను పాఠశాలలకు పంపాలి

- ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా సమన్వయకర్త సుబ్రహ్మణ్యం

ఆత్మకూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపాలని ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఎల్‌వీకేఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, ఆత్మకూరు మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో పట్టణంలోని గిరిజనకాలనీల్లో బుధవారం ప్రత్యేక ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు నుంచి 14 సంవత్సరాల పిల్లలు ఉచిత విద్యను అభ్యసించాలన్నారు. బడిఈడు పిల్లలను పనులకు పంపితే శిక్షలు తప్పవని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్యాన్ని హరించే హక్కు తల్లిదండ్రులకు కూడా లేదన్నారు. ఉర్దూ పాఠశాలల జిల్లా డీఐ ఖాజామొహిద్దీన్, ఐటీడీఏ ఎంఓ శాంతకుమారి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ గురించి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా మేదర వీధి, ఎల్‌ఆర్‌పల్లి గిరిజనకాలనీల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు జిలానీ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సీతాదేవి, పీఆర్‌ఎంటీ లక్ష్మి, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మస్తానమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.కేశవ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర


విశేషాలంకరణలో పోలేరమ్మ తల్లి

సోమశిల : అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి గ్రామంలో పోలేరమ్మ జాతర మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. పోలేరమ్మ తల్లిని విశేష పూలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంగళవాయిద్యాలు, కర్రసాము విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతర మహోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సమీప గ్రామాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వీధిలైట్ల ఏర్పాటు

ఆత్మకూరురూరల్ : మండలంలోని వాశిలిలో పలు వివాదాల కారణంగా ఇటీవల వరకు పంచాయతీ స్థాయిలో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు కొంతమేర నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో స్థానిక సమస్యలపై వాశిలి సర్పంచ్ చెలిక రమా దృష్టి సారించారు. ఇందులో భాగంగా గ్రామంలోని పలు వీధుల్లో బుధవారం విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేయించారు. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తెలిపారు.

వెంగమాంబ ఉత్సవం.. ఊరంతా కోలాహలం


వెంగమాంబ దంపతులకు హారతులు ఇస్తున్న అర్చకులు


హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

దుత్తలూరు : వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వేలాదిగా తరలివచ్చిన భక్తులతో నర్రవాడ ఊరంతా కోలాహలం నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణోత్సవం జరిగింది. దీనికి భక్తులు భారీగా విచ్చేసి హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. చిత్తూరు, గన్నవరం ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్‌రావు, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈఓ ఉషశ్రీ, మాజీ దేవస్థాన చైర్మన్ కరుణాకరబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

భజనలు, బైనడీల నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా కార్యక్రమాలు జరిగింది. విద్యుద్దీపకాంతులతో ఆలయ పరిసరాలు సుందరంగా మారాయి. భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఎడ్ల పందేలు నిర్వహిస్తారు. ఇవి ఉత్సవాలకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ పందేల్లో గెలిచిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు కూడా అందజేస్తారు. వీటితో పాటు వెంగమాంబ దంపతులకు విశేష పూజలు నిర్వహిస్తారు.


పసుపు, కుంకుమను ప్రత్యేక వాహనంలో తీసుకొస్తున్న భక్తులు


పట్టువస్త్రాలు, ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే కాకర్ల, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు

శేషవాహనంపై దేవదేవేరులు



సంగం : మండలంలోని దువ్వూరు గ్రామంలో కొలువైన గంగా పార్వతి సమేత కోటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం సాగింది. భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లక్ష్మీపురం సర్పంచ్ మృతి


దాసరి కొండమ్మ (ఫైల్)

కలిగిరి : మండలంలోని లక్ష్మీపురం సర్పంచ్ దాసరి కొండమ్మ(75) బ్రెయిన్ స్ట్రోక్‌తో బుధవారం ఉదయం మృతిచెందారు. బంధువుల వివరాల మేరకు.. సర్పంచ్ కొండమ్మ తీవ్ర అస్వస్థతకు గురవడంతో కావలిలోని వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారన్నారు.

నీటి నమూనాల సేకరణ

సీతారామపురం : డయేరియా నివారణ చర్యల్లో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు ముందస్తుగా నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సీతారామపురంలోని పలు వీధుల్లో అధికారుల బృందం బుధవారం కుళాయిల వద్ద నీటి నమూనాలు సేకరించి గ్రామ సచివాలయంలో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి, పీఆర్ ఏఈ బాలినేని ప్రవీణ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చిన్నయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో నీటిని పరీక్షించండి

అల్లూరు : డయేరియా సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అల్లూరు మండల వ్యాప్తంగా ప్రతి పంచాయతీలో తాగునీటిని పరీక్షించాలని ఎంపీడీఓ జ్యోతి తెలియజేశారు. ఈ క్రమంలో బుధవారం ప్రతి పంచాయతీలో తమ సిబ్బంది తాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్‌లు, ట్యాంక్ నుంచి ప్రజలకు వచ్చే నీటిని క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరీక్షిస్తున్నారన్నారు. డయేరియా వ్యాధి నిర్మూలనను తమ వంతు కృషి చేస్తున్నామని తెలియజేశారు.


అల్లూరు : బీరంగుంటలో నీటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది


సీతారామపురం : నీటి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

బీటీఏ సభ్యత్వ నమోదు


కొత్తపాలెంలో సభ్యత్వ నమోదు చేస్తున్న బీటీఏ నేతలు

జలదంకి : మండలంలోని సోమవరప్పాడు, బ్రాహ్మణక్రాక కాంప్లెక్స్‌లలో బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.లక్ష్మయ్య మాట్లాడుతూ 117 జీఓను వెంటనే రద్దు చేయాలని కోరారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీటీఏ మండలాధ్యక్షుడు మాధవ, ప్రధాన కార్యదర్శి తలమంచి మహేంద్ర, కోశాధికారి మందా వేణు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన అందించాలి

సీతారామపురం : ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఎంఈఓ షేక్.మస్తాన్‌వలీ కోరారు. తురకపాళెం గ్రామంలోని పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన రుచికర భోజనం అందించాలని సూచించారు. అనంతరం ఎస్సీ కాలనీలో పర్యటించి నేను బడికి పోతా కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిఈడు పిల్లలను బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


పాఠశాలలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

పాఠశాలల్లో అక్షరాభ్యాసం

ఆత్మకూరురూరల్ : మండలంలోని కనుపూరుపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం సరస్వతీపూజ నిర్వహించి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఒకటో తరగతిలో చేరిన చిన్నారులకు ఓనమాలు రాయించారు. 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ తదితర విద్యాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పట్నం అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కనుపూరుపల్లి పాఠశాలలో సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కలుషిత నీటి వల్లే డయేరియా

- మడపల్లిలో ప్రత్యేక వైద్యశిబిరం

ఆత్మకూరు(చేజర్ల) : కలుషిత నీటి వల్ల డయేరియా సంక్రమించే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటిని తాగడం లేదా పరిశుభ్రమైన నీటిని తాగడంతో డయేరియా లాంటి వ్యాధులను అరికట్టవచ్చని చేజర్ల పీహెచ్‌సీ డాక్టర్ మెహతాజ్ అన్నారు. మండలంలోని మడపల్లిలో సచివాలయం వద్ద బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు డయేరియా గురించి అవగాహన కల్పించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. బీపీ, షుగర్ లాంటి వ్యాధులకు మందులు అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మొహతాజ్ మాట్లాడుతూ డయేరియా లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రులను సంప్రదించాలన్నారు. వర్షాకాలం రానుండడంతో డయేరియా నివారణతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.చంద్రయ్య, ఎంసీహెచ్‌ఓ పద్మమ్మ, ఏఎన్‌ఎం మస్తానమ్మ, ఆశా వలంటీర్లు నిర్మల, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.


మడపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ముమ్మరంగా యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

ఉదయగిరి : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో యుటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర కౌన్సిలర్ కె.చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడులను రక్షించుకుందాం, పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం అనే కార్యక్రమ కరపత్రాలను ఉపాధ్యాయులకు అందజేశారు. అనంతరం ఆ సంఘ మండల ప్రధాన కార్యదర్శి ఫణిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నైతిక విలువలు, చదువు, దేశభక్తి, సమానత్వ భావనలు ఏర్పడేలా చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతారన్నారు. అలాంటి బడులను ఉపాధ్యాయులు కాపాడుకుని సమాజాభివృద్ధికి అంకితం కావాలన్నారు. విద్యార్థులు తెలుగు, ఆంగ్ల భాషల్లో చదవడం, రాయడం, మాట్లాడడం లాంటి నైపుణ్యాలు పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. యూటీఎఫ్ సంఘం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడమే కాకుండా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణలో ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు దుర్గాప్రసాద్, పద్మనాభరెడ్డి, రామకృష్ణ, చెన్నకృష్ణయ్య, రవి, ఖాదర్‌బాషా, సారథి తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదులో యూటీఎఫ్ నాయకులు

సన్మానం

ఆత్మకూరు : పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బడుగు శ్రీనివాసులు పదవీ విరమణ చేయనుండడంతో ముందస్తుగా బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓలు నజీర్‌బాషా, చలపతి పాల్గొని, శ్రీనివాసులు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పద్మ, చౌదరి, హైమావతి, వసంత, జమునా రాణి, ఇందిరమ్మ, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాదకద్రవ్యాలతో భవిష్యత్ ఛిద్రం

- కావలి డీఎస్పీ వెంకటరమణ
- గ్రామాలు, పట్టణాల్లో అవగాహన ర్యాలీలు

కావలి : మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు మనిషి జీవితాన్ని, భవిష్యత్‌ను ఛిద్రం చేస్తాయని కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఆధ్వర్యంలో పట్టణంలోని పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలను బుధవారం నిర్వహించారు. స్థానిక ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఓ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ మాట్లాడారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సరదాగా మొదలయ్యే మాదకద్రవ్యాల అలవాటు వ్యసనంగా మారి భవిష్యత్‌ను చీకటిగా మారుస్తుందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వ్యక్తులతో పాటు వారి కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. మత్తు పదార్థాల కారణంగా ఆరోగ్యం చెడిపోవడంతో పాటు ఆర్థికంగా, సామాజికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గంజాయి విక్రయాలపై నిరంతర నిఘా ఉంచుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కావలి ఒకటో రెండో పట్టణ సీఐలు రాజేష్, కొండవీటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కావలి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ వెంకటరమణ, సీఐలు


ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉదయగిరి : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. కళాశాల నుంచి బయలుదేరి మెయిన్‌రోడ్డు మీదుగా పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేసి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాల బారినపడి నష్టపోకుండా క్రమశిక్షణతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తు సాధించాలన్నారు. డ్రగ్స్ రహిత ఏపీ దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వినియోగించే వారి సమాచారం తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.నరసింహులు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వాసుబాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రమణయ్య, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు

ఆత్మకూరు : యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే తీవ్ర అనర్థాలు తప్పవని, వాటికి దూరంగా ఉండాలని ఆత్మకూరు సీఐ జి.వేణు అన్నారు. పట్టణ పరిధిలో పోలీసులు, సెబ్ అధికారులు సంయుక్తంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థులతో పట్టణంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేశారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ వేణు మాట్లాడుతూ ఎక్కడైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా పోలీసులు, సెబ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై ముత్యాలరావు, సెబ్ ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అంధకారం

కలిగిరి : యువత మాదకద్రవ్యాలు వినియోగించడం ద్వారా వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని సెబ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలు, వ్యసనాలకు దూరంగా ఉంటూ పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు కలిగి ఉన్నా, అమ్మినా, కొనుగోలు చేసినా, రవాణా చేసినా వారిపై కేసులు నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీను, సెబ్ సిబ్బంది సుధాకర్, గోపాలకృష్ణ, మాల్యాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సంగం : యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సంగం ఎస్సై నాగార్జునరెడ్డి అన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగం నేతాజీ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట కళాశాల సిబ్బంది ఉన్నారు.


సంగం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగార్జునరెడ్డి


కలిగిరిలో మాట్లాడుతున్న మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ శ్రీను


ఉదయగిరి : బస్టాండ్ సెంటర్‌లో మాట్లాడుతున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి